సాక్షి
గుంటూరు
బుధవారం, 15, నవంబర్, 2023




గ్రీన్‌బోర్డ్స్ బహూకరణ

మంగళగిరి: రోటరీ క్లబ్ ఆధ్వర్యాన నగరంలోని సీకే హైస్కూల్‌లో మంగళవారం బాలల వేడుకలు నిర్వహించారు. రూ. లక్ష విలువైన అధునాతన గ్రీన్ బోర్డ్స్ బహూకరించారు.



ఉర్దూ పాఠశాల సందర్శన

తెనాలిటౌన్: పినపాడు ఉర్దూ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసీం సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనంచేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 3007 క్యూసెక్కులు విడుదల చేశారు.

జయహో..జల ప్రదాత

నేడు మాచర్లకు సీఎం వైఎస్ జగన్ రాక

- వరికపూడిశెల ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా అధికార యంత్రాంగం
- ఆనందం వ్యక్తం చేస్తున్న పల్నాడు రైతులు
- 1,887 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు



మాచర్ల పట్టణం సెయింట్ ఆన్స్ హైస్కూల్ మైదానంలో హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాంప్రసాద్

సాక్షి, నరసరావుపేట: జల ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పల్నాడు ప్రజలు జయహో అంటున్నారు. ప్రజల సాగు, తాగునీటి కష్టాలను తీర్చే వరికపూడిశెల ప్రాజెక్టు పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. గుంటూరు రోడ్డులోని చెన్నకేశవకాలనీ ఎదురు స్థలంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టు రెండు దశల్లో పనులు పూర్తయితే మాచర్ల, వినుకొండ, యర్రగొండపాలెం నియోజకవర్గాలలోని 1.25 లక్షల ఎకరాల్లో ఆయకట్టుకు సాగునీరు, లక్షమందికి తాగునీరు అందనుంది. ఈ బృహత్తర ప్రాజెక్టు పనుల శంకుస్థాపనకు సీఎం వస్తుండటం పట్ల ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు జల ప్రదాతకు స్వాగతం పలుకుతూ మాచర్ల పట్టణంలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. సీఎం పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాంప్రసాద్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు మంగళవారం మాచర్లలో సభకు జరుగుతున్న ఏర్పాట్ల తీరు పర్యవేక్షించారు. సీఎం హెలిప్యాడ్, ఆయన పర్యటించే బస్సు, కాన్వాయ్ వెళ్లే మార్గాలను కలెక్టర్, ఎస్పీ, జేసీలు పరిశీలించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు ప్రజల



భద్రతా చర్యలపై సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

చిరకాల స్వప్నం సాకారం చేస్తున్న వేళ సభను విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చే జనాలకు ఏ ఇబ్బంది రాకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.

పటిష్ట బందోబస్తు...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మంగళవారం మాచర్లలో బందోబస్త్ వివరాలను సమీక్షించారు. సీఎం పర్యటన సందర్భంగా ఇద్దరు అదనపు ఎస్పీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, 150 మంది ఎస్ఐలు, 220 మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, 896 మంది కానిస్టేబుళ్లు, 88 మంది మహిళా కానిస్టేబుళ్లు, 436 మంది హోంగార్డులతో కలిపి మొత్తం 1,837 మంది అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించనున్నారు. వీరికి అదనంగా మరో 50 మంది ప్రత్యేక బలగాల సిబ్బందితో విధులు నిర్వహించనున్నారు. వీవీఐపీ, వీఐపీలు సంచరించే హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రహదారి వెంబడి బందోబస్తు విధులు కేటాయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటన తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రతలు తీసుకుంటూ, వారి వాహనాలకు కేటాయించిన పార్కింగ్ స్థలాల గురించి వారికి తెలియపరచాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పర్యటన ముగిసే వరకు అందరూ అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆదేశించారు. హెలిప్యాడ్, సభ ప్రాంగణంలో చేసిన భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. వీవీఐపీ పర్యటనకు సంబంధించి కాన్వాయ్ ట్రయల్స్‌ను ఎస్పీ పరిశీలించారు. సభా ప్రాంగణం వద్దకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండాచర్యలు తీసుకోవాలని, సభావేదిక వద్ద ఏర్పాటు చేసే గ్యాలరీలు, సభావేదిక చుట్టూ పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు చంద్రశేఖర్, రామచంద్రరాజు డీఎస్పీలు ఆదినారాయణ, కేవీ మహేష్, రవిచంద్ర, పల్లపురాజు, షరీఫుద్దీన్, చిన్నికృష్ణ, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఇలా...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన మినిట్ టూ మినిట్ షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం విడుదల చేసింది.

- ఉదయం 9.45 గంటలకు సీఎం క్యాంప్ ఆఫీస్ నుంచి వాయుమార్గంలో బయలుదేరతారు.
- ఉదయం 10.35 గంటలకు పట్టణంలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- పది నిమిషాలపాటు స్వాగతం పలకడానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం మాట్లాడతారు.
- ఉదయం 11 గంటలకు చెన్నకేశవ కాలనీ ఎదురు ఏర్పాటు చేసిన సభాస్థలికి సీఎం చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన వరికపూడిశెల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల శిలాఫలకం ఆవిష్కరించనున్నారు. తర్వాత జలవనరుల శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించనున్నారు. అనంతరం సభను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.
- 12.30 గంటలకు సెయింట్ ఆన్స్ స్కూల్ మైదానంలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12.30–1.30 గంటల మధ్య హెలిప్యాడ్ వద్ద స్థానిక నేతలతో మాట్లాడతారు.
- మధ్యాహ్నం 1.35 గంటలకు తాడేపల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి బయలుదేరనున్నారు.



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

పర్యటనను విజయవంతం చేద్దాం...



పల్నాడు ప్రాంత ప్రజల తలరాతను మార్చే వరికపూడిశెల ప్రాజెక్టు పనులు ప్రారంభం కోసం మాచర్ల వస్తున్న జగనన్నకు అపూర్వ స్వాగతం పలకనున్నాం. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరుతున్నా.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ప్రభుత్వవిప్, మాచర్ల ఎమ్మెల్యే

చిరకాల స్వప్నం సాకారం



ఏడు దశాబ్దాలుగా పల్నాడు రైతులు ఎదురుచూస్తున్న వరికపూడిశెల ప్రాజెక్టు పనుల ప్రారంభానికి వస్తున్న రైతు బాంధవుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం. ఈ ప్రాజెక్టు ద్వారా 1.25 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, లక్షమందికిపైగా తాగు నీరు అందనుంది. వైఎస్సార్ ఆశయాన్ని సాకారం చేయడానికి మాచర్లకు వస్తున్న జగనన్నకు రైతులు పెద్దసంఖ్యలో హాజరై కృతజ్ఞతలు తెలియజేద్దాం.

– పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి

న్యూస్‌రీల్

నేడు జగనన్నకు చెబుదాం

తాడేపల్లిరూరల్: తాడేపల్లిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాడేపల్లిలోని శుభమస్తు కల్యాణ మండంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఇతర అధికారులు హాజరు కానున్నారని తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

శ్రీరామ పాదుకలు అందజేత



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై చిన్న జీయర్‌స్వామి 67వ తిరు నక్షత్ర మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీరామ పాదుకలను బహూకరించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ చిన్నజీయర్ స్వామి 67వ తిరు నక్షత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని, శ్రీరామ పాదుక పూజ గావించామని, త్రిదండి చిన్న రామానుజ జీయర్‌స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం, తీర్థ ప్రసాదాలు గావించారని తెలిపారు. తిరునక్షత్ర మహోత్సవాల్లో భాగంగా పలు పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులకు శ్రీరామ పాదుకలను బహూకరించారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి స్వాములకు భిక్ష



పాత గుంటూరు: వాసవీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్ అగ్రహారంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కల్యాణ మండపంలో బుధవారం నుంచి డిసెంబర్ 25 వరకు స్వామివారి పంచమ భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమితి వ్యవస్థాపకులు దింటకుర్తి వెంకట రవికుమార్ తెలిపారు. మంగళవారం ఆర్.అగ్రహారం ఫ్యాన్సీ ప్లాజాలోని సమితి కార్యాలయంలో కార్యక్రమం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి పూజా కార్యక్రమం, అనంతరం 7.30 గంటల నుంచి భిక్ష కార్యక్రమంలో అయ్యప్పలు, మాలధారణ స్వాములు పాల్గొని భిక్షను స్వీకరించాలని కోరారు. సమావేశంలో సమితి సభ్యులు టీఎల్వీ వీరాంజనేయులు, మున్నలూరి గౌరీ శంకర్, అవ్వారు అనిల్, ఊటుకూరు సత్యనారాయణ, బుజ్జి, తోట కిరణ్‌కుమార్, డి.అశోక్ పాల్గొన్నారు.


ఘాట్‌రోడ్డులో ప్రమాదం

- ఒకరికి తీవ్ర గాయాలు
- ఏడుగురికి స్వల్పగాయాలు

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ ఘాట్‌రోడ్డులో వాహనం అదుపుతప్పి పల్టీకొట్టిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా గాజుపల్లి గ్రామానికి చెందిన భక్తులు 13మంది విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం చేసుకుని కోటప్పకొండకు బయలుదేరారు. ఘాట్‌రోడ్డులోని పార్క్ సమీపంలోని మలుపు వద్ద వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి పక్కకు పల్టీ కొట్టింది. దీంతో ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తున్న భక్తులు వాహనంలోని వారిని బయటకు తీశారు. వాహనంలోని భక్తుల్లో ఏడుగురికి స్వల్పగాయాలు కాగా ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని కోటప్పకొండలోని ప్రాథమిక వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 524.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 4,410, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 841.60 అడుగుల వద్ద ఉంది. రోజా నుంచి శ్రీశైలం జలాశయానికి 4,466 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



సామాజిక సాధికార యాత్రకు సర్వం సిద్ధం

నేడు పొన్నూరులో బహిరంగ సభ

పొన్నూరు: వైఎస్సార్ పార్టీ ఆధ్వర్యాన పొన్నూరు పట్టణంలో బుధవారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు సర్వం సిద్ధమైంది. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పర్యవేక్షణలో పార్టీ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బస్సు యాత్ర, భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో ఆయన పర్యటించారు. బస్సు యాత్రలో మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున, ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు, రీజనల్ కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, జూపూడి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, సినీ నటుడు అలీ, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్ యాదవ్, హఫీజ్ ఖాన్‌తోపాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.




ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

బస్సు యాత్ర సాగేదిలా..

మధ్యాహ్నం 3.15 గంటలకు పట్టణంలోని వీరాంజనేయ స్వామి దేవాలయం నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతుంది. ర్యాలీగా పొన్నూరు పట్టణంలోని ఐలాండ్ సెంటర్ వరకు యాత్ర సాగుతుంది. ఐలాండ్ సెంటర్లో బహిరంగ సభ.

సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయండి



మాణిక్య వరప్రసాద్

పట్నంబజారు: పొన్నూరులో బుధవారం నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. రాజకీయ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా నా ఎస్సీలు...నా ఎస్టీలు...నా బీసీలు...నా మైనార్టీలని ప్రతి ఒక్కరిని తన సొంత మనుషుల్లా భావించిన వ్యక్తి వైఎస్.జగన్ అని కొనియాడారు. సామాజికపరంగా ప్రతి ఒక్కరికి రాజకీయంగా, ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయూతనిస్తూ నామినేటెడ్ పదవులు మొదలు కేబినెట్ మంత్రుల వరకు సమన్యాయం పాటించారని, ఇది కేవలం సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో చేసిన మంచిని వివరించేందుకు నిర్వహించతలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను పార్టీ కార్యకర్తలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

బాలలు నవభారత నిర్మాతలు

పాతగుంటూరు:బాలలకు సంతోషకరమైన, భద్రమైన బాల్యాన్ని, మంచి విద్యను, పౌష్టికాహారాన్ని అందించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు, జిల్లాస్థాయి బాలల దినోత్సవంలో కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యేలు షేక్ మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పాల్గొన్నారు. భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి వెలిగించారు. బాలల హక్కుల రక్షణపై రూపొందించిన పోస్టర్ ఆవిష్కరించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో విజేతలైన చిన్నారులకు బహుమతులు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. డెప్యూటీ మేయర్ షేక్ సజీలా, జిల్లా బాలల పరిరక్షణ అధికారి చందోలు విజయ్‌కుమార్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమాదేవి పాల్గొన్నారు.



చిన్నారులతో కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, ఎమ్మెల్యేలు

తెనాలి మున్సిపల్ పీఠంపై మరోసారి బీసీ మహిళ

- 16న కౌన్సిల్ సమావేశం
- చైర్‌పర్సన్ ఎన్నిక
- కౌన్సిలరు తాడిబోయిన రాధిక ఎన్నిక లాంఛనమే



తెనాలి: మహామహులు ఏలిన తెనాలి మున్సిపాలిటీకి చైర్‌పర్సన్‌గా మరోసారి బీసీ మహిళకు దక్కనుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పట్టణ ఎనిమిదో వార్డు కౌన్సిలరు తాడిబోయిన రాధికను ఈనెల 16న ఉదయం 11 గంటలకు జరగనున్న కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో ఎన్నుకోనున్నారు. సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. ఈ ప్రకారం ఉత్తర్వులు జారీ అయిన విషయం తెలిసిందే. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ గల పట్టణ మున్సిపల్ కౌన్సిల్‌లో స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఇచ్చిన హామీప్రకారం నూతన చైర్‌పర్సన్‌గా తాడిబోయిన రాధిక ఎన్నిక లాంఛనప్రాయమని తెలిసిందే. 1909లో ఏర్పడిన తెనాలి మున్సిపాలిటీకి తొలుత డిప్యూటీ కలెక్టర్‌ను చైర్మన్‌గా నామినేట్ చేస్తూ వచ్చారు. 1920 నుంచి మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తూ వచ్చారు. తొలి మున్సిపల్ చైర్మన్‌గా రావుబహద్దూర్ చెమిటిగంటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి ఎన్నికయ్యారు. స్వాతంత్ర్యయోధులు, న్యాయవాదులు, సంఘ సంస్కరణవాదులు ఎన్నికల్లో చైర్మన్ పదవిని చేపడుతూ వచ్చారు. తర్వాతి కాలంలో చైర్మన్ పదవిని రాజకీయ నేతలు ఎన్నికవుతూ వచ్చారు. మున్సిపల్ చైర్మన్లుగా చేసిన నలుగురు అనంతరం ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరిలో ఆలపాటి వెంకట్రామయ్య, అన్నాబత్తుని సత్యనారాయణ రాష్ట్ర మంత్రులుగానూ చేశారు. 114 ఏళ్ల చరిత్ర కలిగిన తెనాలి మున్సిపాలిటీలో మహిళకు చైర్‌పర్సన్‌గా అవకాశం రావటానికి సుదీర్ఘకాలం పట్టింది. 1995 ఎన్నికల్లో ఆలమూరి విజయలక్ష్మీ కుమారి ఎన్నికై, తొలి మహిళా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గుర్తింపును పొందారు. 2005లో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి బీసీలకు రిజర్వు కావటంతో ఆ వర్గానికి చెందిన డాక్టర్ తాడిబోయిన మస్తానమ్మను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. మూడేళ్ల తర్వాత అదే వర్గీయురాలైన దొడ్డక సీతామహాలక్ష్మికి అవకాశం ఇచ్చారు.

సామాజిక సాధికారతకు పెద్దపీట

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సామాజిక సాధికారతకు పెద్ద పీట వేస్తున్న విషయం తెలిసిందే. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముస్లిం మైనారిటీ వర్గానికి చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పిస్తానని, రెండున్నరేళ్ల తర్వాత బీసీలకు చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యేలా చూస్తానని హామీనిచ్చారు. ఆ ప్రకారం తొలుత సయ్యద్ ఖలేదా నసీమ్‌ను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ఆ పదవి వరించిన తొలి ముస్లిం మహిళగా గుర్తింపు తెచ్చుకున్నారు. అప్పట్లో ఇచ్చిన హామీ ప్రకారం మళ్లీ ఇప్పుడు బీసీ వర్గీయురాలు తాడిబోయిన రాధికకు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి వరించనుంది. రాధిక, ఆమె భర్త తాడిబోయిన రమేష్‌లు రెండు దశాబ్దాలుగా మున్సిపల్ రాజకీయాల్లో కొనసాగుతున్నారు. తాడిబోయిన రమేష్ రెండు పర్యాయాలు కౌన్సిలరుగా చేయగా, రాధిక రెండో పర్యాయం కౌన్సిలరుగా ప్రస్తుత కౌన్సిల్‌లో ఉన్నారు. బీసీ వర్గంతోపాటు అనుభవానికి ప్రాధాన్యతగా చైర్‌పర్సన్ పదవికి ఎంపిక చేసినట్టు పార్టీ వర్గాల్లో ఉంది.



గుంటూరు అరండల్‌పేట శివాలయంలో పూల అలంకరణతో శివలింగం

అంతటా శివోహం



అరండల్‌పేట 6వ లైన్‌లోని శివాలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

'న కార్తిక సమోమాసః' అని మహర్షి అగస్త్యుడి మాట. పన్నెండు మాసాల్లో కార్తిక మాసానికంటే మించినది మరొకటి లేదని అర్థం. పుణ్యం సంపాదించుకోవడానికి, పాపం పోగొట్టుకోవడానికి భగవంతుడు ఇచ్చిన ఓ మంచి అవకాశం కార్తిక మాసం. అలాంటి మాసాన్ని భక్తజనం సద్వినియోగం చేసుకుంటారు. ప్రాతఃకాలంలోనే స్నానాదులు చేయడం, దేవాలయాలకు వెళ్లి దీపాలు వెలిగించి అభిషేక, అర్చనాదులు నిర్వహించడం, ఏక భుక్తం వంటివి మాసమంతా ఆచరిస్తారు. మంగళవారం నుంచి ఈ మాసం ఆరంభం కావడంతో గుంటూరులోని ప్రధాన దేవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ప్రాంగణాలలో మహిళలు ముగ్గులుపెట్టి వాటిపై దీపాలు వెలిగించి పూజలు చేశారు. పంచామృతాలతో లయకారుడిని అభిషేకించి భక్తజనం తరించింది. – గుంటూరు

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని విద్యార్థి మృతి


దొర వాసు (ఫైల్)

పట్నంబజారు: ట్రాక్టర్ ఢీకొని విద్యార్థి మృతిచెందిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లచెరువు 0 లైనుకు దొర వాసు (14) అదే ప్రాంతంలోని మాజేటీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం సమయంలో భోజనం చేసిన తరువాత పాఠశాలకు సెలవు కావటంతో ఆడుకునేందుకు బయటకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్ళాడు. సంపత్‌నగర్‌లోని శిశుమందిర్ పాఠశాల వద్ద స్నేహితులతో కలిసి ఆడుకుంటున్న సమయంలో నల్లచెరువుకు నుంచి రామనామక్షేత్రం వైపు వెళుతున్న మట్టి ట్రాక్టర్ వాసు తలపై ఎక్కటంతో తల భాగం నుజ్జునుజ్జు అయింది. స్థానికులు ఆసుపత్రికి తీసుకుని వెళ్లేసరికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ని నడపటంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి వాసు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

ఐదుగురు మహిళలు, నలుగురు పురుషులు అరెస్ట్



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పాత ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడిచేసి ఐదుగురు మహిళలను, నలుగురు పురుషులను అరెస్ట్ చేశారు. ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం పాత ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద ఓ నివాసంలో మహిళలు, పురుషులు పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో మహిళా పోలీసులతో తనిఖీ చేశామని, ఈ తనిఖీల్లో ఐదుగురు మహిళలు, నలుగురు పురుషులు పట్టుబడ్డారని, వారివద్ద నుంచి రూ.85,220 స్వాధీనం చేసుకుని తొమ్మిదిమందిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

'ఆడుదాం- ఆంధ్రా'ను సమన్వయంతో నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: గ్రామ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి వరకు డిసెంబర్ 15 నుంచి జనవరి 26 వరకు జరగనున్న ఆడుదాం- ఆంధ్రా కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ దీనిపై ఏ అవసరమొచ్చినా వెంటనే సంప్రదించాలన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తి, ఐకమత్యం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో మొత్తం ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించాలన్నారు. 15 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. గ్రామ సచివాలయం స్థాయిలో పోటీలు వచ్చే నెల 15 నుంచి 20 వరకు, మండల స్థాయిలో వచ్చే నెల 21 నుంచి జనవరి 4 వరకు, నియోజకవర్గ స్థాయిలో జనవరి 5 నుంచి 10 వరకు, జిల్లా స్థాయిలో జనవరి 11 నుంచి 21 వరకు రాష్ట్ర స్థాయిలో జనవరి 22 నుంచి 25 వరకు నిర్వహించాలన్నారు. 44 రోజులపాటు నిరంతరం క్రీడా మహోత్సవం నిర్వహించాలన్నారు. వాలంటీర్లు ద్వారా ఈ నెల 20 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. పోటీలకు సంబంధించిన క్రీడా స్థలాలు, వసతి, మౌలిక సదుపాయాలు, అంపైర్లు, ఇలా ప్రతి ఒక్క అంశంలోనూ బృందాలుగా ఏర్పడి ఏర్పాట్లు చేయాలన్నారు. బహుమతులు కూడా లక్షల రూపాయల్లో ఉంటాయని జేసీ వివరించారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, స్టెప్ సీఈఓ పల్లవి, డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండాల్సిందే..

గుంటూరు వెస్ట్: ఐదు నుంచి 18 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లలందరూ పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసించాలని, ఆవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రాస్ ఎన్‌రోల్మెంట్ రేషియో (జీఈఆర్)ను ప్రధానోపాధ్యాయులు, మండల స్థాయి అధికారులు సమీక్షించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే జీఈఆర్ 95 శాతం పూర్తయిందన్నారు. నూరు శాతం పిల్లలందరూ పాఠశాలల్లో ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారు, డబుల్ ఆధార్ కార్డు ఉన్నవారి వివరాలు పూర్తి స్థాయిలో పరిశీలించి విద్యా శాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేయాలన్నారు.

మచ్చుకాయల నిషేధానికి సహకరించండి

గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ రాజనారాయణ


మాట్లాడుతున్న యార్డు చైర్మన్

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో మచ్చు కాయల నిషేధానికి అందరూ సహకరించాలని యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ కోరారు. మిర్చి యార్డు ఆవరణలోని పరిపాలన కార్యాలయంలో మిర్చి ఎక్స్‌పోర్టర్స్, మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారుల అసోసియేషన్స్, వివిధ కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. యార్డులో మిర్చి రైతులకు నష్టం చేకూర్చే చర్యలు సహించబోమని స్పష్టం చేశారు. మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి రెండు మాసాలకు ఒకసారి ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేసుకుని, సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. మిర్చి ఎక్స్‌పోర్టర్స్, ఎగుమతి, దిగుమతిదారుల అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ మచ్చు కాయలు తీయడానికి తాము వ్యతిరేకమన్నారు. అనంతరం వేమెన్స్, సెక్యూరిటీ, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి, వైస్ చైర్మన్ షేక్ మాబు సుభాని, మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు, మిర్చి ఎక్స్‌పోర్టర్స్, ఎగుమతి, దిగుమతి వ్యాపారుల అసోసియేషన్ నాయకులు టి.రామకృష్ణ, జుగిరాజ్ భండారీ, సాంబశివరావు, లేళ్ల పెద అప్పిరెడ్డి, కె.సుధాకర్, కేమార్క్ శ్రీనివాసరెడ్డి, అధికారులు శివారెడ్డి, సుబ్రమణ్యం, వివిధ కార్మిక సంఘాల అసోసియేషన్‌ల నాయకులు పాల్గొన్నారు.

యార్డుకు 25,982 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 25,982 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 22,726 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.22,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,000 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది.

మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డికి క్యాబినెట్ హోదా

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

పట్నంబజారు: శాసనమండలిలో విప్ లేళ్ల అప్పిరెడ్డికి క్యాబినెట్ హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని ఇటీవల శాసనమండలిలో విప్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పలువురు విప్‌ల తరహాలోనే అప్పిరెడ్డికి కూడా క్యాబినెట్ హోదాను కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్జీ రంగా వర్సిటీని సందర్శించిన మలేషియా వర్సిటీ బృందం


వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి, అధికారులతో మలేషియా యూనివర్సిటీ ప్రతినిధుల బృందం

గుంటూరు రూరల్: మలేషియా, ఇండియాల మధ్య పరస్పర విద్యా మార్పిడి, తదితర విషయాలపై కూలంకుషంగా చర్చించి ఒక అవగాహనకు వచ్చేందుకు యూనివర్సిటీ ఆఫ్ మలేషియా ప్రతినిధుల బృందం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిందని విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీ దేవి తెలిపారు. మంగళవారం మలేషియా యూనివర్సిటీకి చెందిన ప్రతినిధులు డాక్టర్ మహమ్మద్ ఆరిఫుల్లా, డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ కరీమ్‌లు విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలు, విద్యార్థులతో ఇంట్రాక్షన్, విద్యాభివృద్ధి విషయాలపై వీసీ, యూనివర్సిటీ అధికారులతో చర్చించారు. బాపట్లలోని వ్యవసాయ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఇరుదేశాలు విద్యా సంబంధమైన విషయాలపై పరస్పర సహకారానికి విశ్వవిద్యాలయం అధికారులతో అవగాహన కుదుర్చుకున్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, అగ్రికల్చర్ డీన్ డాక్టర్ జి.కరుణాసాగర్, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.ప్రశాంతి, ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, కంట్రోలర్ ఆర్ ఎగ్జామినేషన్ డాక్టర్ పి.సుధాకర్, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డాక్టర్ పి.సాంబశివరావు పాల్గొన్నారు.

చిప్స్ ఫార్మశీలో అంతర కళాశాలల మహిళల కబడ్డీ పోటీలు



గుంటూరు రూరల్: క్రీడల్లో జయాపజయాలు సహజమని అపజయాలకు కుంగిపోకుండా క్రీడల్లో నైపుణ్యాలు మెరుగు పరుచుకునేందుకు ప్రతి క్రీడాకారిణి కృషిచేయాలని చేబ్రోలు హనుమయ్య ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని చిప్స్ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలకు చెందిన క్రీడాకారిణిలు పోటీలలో తలపడ్డారు. పోటీలలో ఏఎన్‌యూ వ్యాయామ కళాశాల జట్టు ప్రథమ స్థానం సాధించగా, కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు ద్వితీయ స్థానం, తెనాలి జేఎంజే కళాశాల జట్టు తృతీయ స్థానం సాధించాయి. విజేతలకు ఏఎన్‌యూ ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రమీలారాణి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. క్రీడల పరిశీలకులుగా డాక్టర్ అరుణ సుజాత పర్యవేక్షించారు. అనంతరం ఏఎన్‌యూ సౌత్‌జోన్ మహిళా కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్.గోపాలకృష్ణ విజేతలను అభినందించారు.

వివాలో ఘనంగా బాలల దినోత్సవం


విద్యార్థులతో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఉపాధ్యాయులు

పెదకాకాని: వివా ది స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నంబూరు వివా స్కూల్‌లో బాలల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఆహ్లాదకరమైన వాతావరణంలో రిలే రేస్, బ్యాక్ వాకింగ్, ఫ్రాగ్ జంప్ వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన తికమకల బండి సందేశాత్మక హాస్యనాటిక ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు ప్రదర్శించిన సంగీత, నృత్య ప్రదర్శనలు అలరించాయి. స్కూల్ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, డైరెక్టర్ ఎల్‌టీ కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ సరళాదేవి, పీవైపీ హెడ్ కె.మాధవి పాల్గొన్నారు.

'చిల్డ్రన్స్ ఆఫ్ హెవెన్' ఇరానీ చిత్రం ప్రదర్శన


'చిల్డ్రన్స్ ఆఫ్ హెవెన్'లో సన్నివేశం

తెనాలి: బాలల దినోత్సవం సందర్భంగా చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ, తెనాలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల ప్రదర్శనను మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలోని ఏపీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ థియేటరులో చిత్రోత్సవాన్ని ప్రారంభించారు. తొలిగా ఇరానీ బాలల చిత్రం 'చిల్డ్రన్స్ ఆఫ్ హెవెన్' ప్రదర్శించారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రావిపాటి వీరనారాయణ, విశ్రాంత ప్రిన్సిపల్ కె.రామరాజు, సంస్థ ఉపాధ్యక్షుడు బి.లలితానంద ప్రసాద్, మునిపల్లి శ్రీకాంత్, మురళి పాల్గొన్నారు. ఈనెల 30వ తేదీ వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో, చిల్డ్రన్ ఫిలిం సొసైటీలచే చిత్రాలను ప్రదర్శిస్తామని ప్రధాన కార్యదర్శి బొల్లిముంత కృష్ణ వెల్లడించారు.

కట్నం తేవాలంటూ భార్యకు వేధింపులు

- మొదటి భార్య సంతానంతో కలిసి భర్త దాడి
- పోలీసులను ఆశ్రయించిన మహిళ
- కేసు నమోదు చేయకపోవడంతో మనస్తాపం
- పోలీస్‌స్టేషన్ ముందు ఆత్మహత్యా యత్నం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో డోలాస్ నగర్‌లో నివాసముండే ఓ ఆటోడ్రైవర్ తన భార్య చనిపోవడంతో మ్యారేజ్ బ్యూరో ద్వారా వివాహమై భర్త వదిలేసిన ఓ మహిళను చర్చిలో వివాహం చేసుకున్నాడు. పెళ్లి చేసుకున్న అనంతరం కట్నం కావాలని మొదటిభార్య సంతానంతో కలిసి దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై 5 రోజుల క్రితం సదరు మహిళ తాడేపల్లి పోలీసులను ఆశ్రయించింది. ఆమెకు ఎటువంటి న్యాయం జరగకపోవడంతో మంగళవారం పోలీస్‌స్టేషన్ వద్ద ఆత్మహత్యయత్నం చేసింది. బాధిత మహిళ వివరాల ప్రకారం.. మ్యారేజ్‌బ్యూరో ద్వారా డోలాస్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ బుచ్చిబాబును అనురాధ 2023 ఫిబ్రవరి 11వ తేదీన ఓ చర్చిలో వివాహం చేసుకున్నారు. వివాహం చేసుకునేముందు తన భార్య చనిపోయిందని, తన ఇద్దరు పిల్లలు తన దగ్గర ఉండరని, సొంత ఇంట్లో నివాసముంటామని, మొదటి భర్తతో పుట్టిన నీ కొడుకును సైతం హాస్టల్‌లో ఉంచాలని బుచ్చిబాబు అనురాధతో చెప్పాడు. బుచ్చిబాబు కుమార్తెకు వివాహమైనా భర్తకు దూరంగా ఉండడంతో ఆమె కూడా అదే ఇంట్లో నివాసముంటోంది. వివాహమైనప్పటి నుంచి ఇంటి ఖర్చులకు కూడా డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నాడని, ఇంటి ఖర్చుల నిమిత్తం డబ్బులు అడిగితే నువ్వు నాకు కట్నం ఇవ్వలేదు, ముందు కట్నం తేవాలని వేధింపులకు గురిచేశారని బాధితురాలు అనురాధ వాపోయింది. ఈవిషయమై నిలదీయడంతో తనపై పలుసార్లు దాడికి పాల్పడ్డాడని తెలిపింది. ఐదు రోజుల క్రితం బుచ్చిబాబు, అతని కుమార్తె, కుమారుడు, తల్లి తన నోట్లో గుడ్డలు కుక్కి ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని హింసించగా, వారినుంచి తప్పించుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చానని, ఇక్కడ పోలీసులు ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. చివరకు సీఐ మల్లికార్జునరావును కలవగా, మ్యారేజ్ సర్టిఫికెట్ తేవాలని సూచించారన్నారు. తన మొదటి భర్త వదిలేసి ఎటో వెళ్లిపోతే అతనితో విడాకులు అయినట్లు పత్రాలు, మరల బుచ్చిబాబును ద్వితీయ వివాహం చేసుకున్నట్లు మ్యారేజ్ సర్టిఫికేట్ కావాలని అంటున్నారని, వివాహం జరిగిన చర్చిలో పాస్టర్‌ను మ్యారేజ్ సర్టిఫికేట్ అడిగితే మేము అలాంటివి ఇవ్వమని చెబుతున్నారని బాధిత మహిళ వాపోయింది. ఈక్రమంలో పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యయత్నం చేయగా స్థానిక మీడియా ప్రతినిధులు అడ్డుకున్నారు. ఈ సంఘటనపై పోలీసులను వివరణ అడుగగా అనూరాధ రెండవ భర్త బుచ్చిబాబు అందుబాటులో లేడని, అతడ్ని పోలీస్‌స్టేషన్‌కు రావాలని వారి కుటుంబ సభ్యులకు హెచ్చరించామని, అనూరాధ, బుచ్చిబాబుల మధ్య సఖ్యత కుదరపోతే కేసు నమోదు చేసి ఫ్యామిలీ కౌన్సెలింగ్‌కు పంపనున్నట్లు తెలిపారు.

కేఎల్‌యూలో వాలీబాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న త్రిదండి అహోబిల రామానుజ స్వామి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో మంగళవారం వాలీబాల్ (పురుషుల) పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ మాట్లాడుతూ జై శ్రీమన్నారాయణ, వీఆర్ యూత్ క్లబ్, కేఎల్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పురుషుల విభాగం ప్రారంభోత్సవాన్ని శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ స్వామి లాంఛనంగా ప్రారంభించారని తెలిపారు. క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ఎదుర్కోవడం నేర్పుతాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 14 విశ్వవిద్యాలయాలు, ఆయా ఇంజినీరింగ్ కళాశాలల నుంచి మొత్తం 14 టీమ్‌లు పాల్గొన్నాయన్నారు. అన్ని జట్లు రెండు రౌండ్‌లను పూర్తిచేసుకోగా, సెమీ ఫైనల్‌కు 4 జట్లు సిద్ధమయ్యాయన్నారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు ప్రారంభం

పెదకాకాని: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభమవుతాయని వ్యాయామోపాధ్యాయుడు మస్తాన్‌రెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా , పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి జిల్లా జట్టుకు ఎంపికైన 500 మంది బాల బాలికలు (క్రీడాకారులు)పాల్గొంటారన్నారు. అండర్ 17, అండర్ 14 విభాగాలలో బుధ, గురు, శుక్రవారాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల నిర్వహణలో 13 జిల్లాల నుంచి 50 మంది స్పోర్ట్స్ మేనేజర్లు, 50 మంది వ్యాయామోపాధ్యాయులు పాల్గొంటారన్నారు. బుధవారం సాయంత్రం 3 గంటలకు అతిథుల చేతుల మీదుగా రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు ప్రారంభమవుతాయని పీఈటీ మస్తాన్‌రెడ్డి వివరించారు.

పైపుల చోరీ కేసులో ముగ్గురు అరెస్టు


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న తుళ్ళూరు సీఐ ఆనందరావు

తాడికొండ: తుళ్ళూరు మండలంలో బీఎస్ఆర్ కంపెనీకి చెందిన ఇనుప వాటర్ పైపులు దొంగతనం చేసిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తుళ్ళూరు సీఐ ఆనందరావు తెలిపారు. మంగళవారం తుళ్ళూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మంగళగిరికి చెందిన కృష్ణారావు అనే వ్యక్తి ఈ దొంగతనాలకు మూల కారకుడని, గత కొంత కాలంగా రాజధానిలోని ఇనుప వాటర్ పైపులను గ్యాస్ కట్టర్ల సాయంతో కత్తిరించి ముక్కలుగా చేసి స్క్రాప్ కింద అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. ఐనవోలు, దొండపాడు ప్రాంతాల్లో జరిగిన దొంగతనాలపై బీఎస్ఆర్ కంపెనీకి చెందిన ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడు కృష్ణారావుతో పాటు దుగ్గిరాల మండలం చిలుమూరుకు చెందిన గ్యాస్ కట్టర్ ఫిరోజ్, స్క్రాప్ కొనుగోలు చేసిన రామిరెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన వీళ్ళందరూ దొంగతనాలకు పాల్పడ్డారని, ఈ కేసుకు సంబంధించి మరో ముగ్గురు పరారీలు ఉన్నందున వారిని త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. ఎస్ఐ సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చియార్డులో మహిళపై దాడి ఘటనలో నిందితుల అరెస్ట్

- నాలుగు నెలల క్రితం ఘటన.. నేడు సోషల్ మీడియాలో హల్‌చల్
- నిందితులను పట్టుకున్న నల్లపాడు పోలీసులు

గుంటూరు రూరల్: నాలుగు నెలల క్రితం జరిగిన సంఘటనను కొందరు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశారు. దీంతో నల్లపాడు పోలీస్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని బాధితురాలిని కలిసి ఆమె ద్వారా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నాలుగు నెలల క్రితం జరిగిన సంఘటనను సోషల్ మీడియాలో వచ్చిన కొన్ని గంటల వ్యవధిలో కేసు నల్లపాడు పోలీసులు ఛేదించారు. సీఐ సీహెచ్ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం నల్లచెరువు వర్కర్స్ కాలనీకి చెందిన పి.రోజాబాయి మిర్చియార్డులో కూలీ పనులు చేసుకుని జీవిస్తుండేది. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం రోజాబాయి మిర్చి యార్డులో దుకాణాలవద్ద తిరుగుతుండగా అప్పటికే దుకాణాల్లో మచ్చుకాయలు, మిర్చి చోరీలు జరుగుతున్న నేపథ్యంలో దుకాణాల యాజమానులు అనుమానాస్పదంగా తిరుగుతున్న రోజాబాయిని ఎందుకు ఇక్కడ తిరుగుతున్నావని ప్రశ్నించారు. ఈ క్రమంలో రైతులు గుమిగూడి మిర్చి చోరీలు జరుగుతుంటే ఇక్కడెందుకు తిరుగుతున్నావని ప్రశ్నించారు. ఎక్కువ మంది జనాలు గుమిగూడటంతో మిర్చియార్డులో ప్రైవేట్ సెక్యూరిటీగా పనిచేస్తున్న హౌసింగ్‌బోర్డ్ కాలనీకి చెందిన షేక్ వలి, అనందపేటకు చెందిన సయ్యద్ మక్బుల్‌లు గొడవ జరుగుతున్న ప్రదేశానికి చేరుకున్నారు. రోజాబాయిని అక్కడినుంచి బయటకు పంపే క్రమంలో ఆమెకు, ఇరువురు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి వివాదం జరిగిందని దానిని ఎవరో ఫోన్‌లో చిత్రీకరించి ఇలా చేశారని బాధితురాలు, నిందితులు తెలిపినట్లు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేశామని ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. గంటల వ్యవధిలో కేసును ఛేదించిన నల్లపాడు పోలీసులను సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా అభినందించారు.